అంగన్‌వాడీల పోరుబాట

దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిపై అంగన్‌వాడీలు కన్నెర్ర చేశారు. ప్రభుత్వం మొద్దునిద్రను తొలగించేందుకు పోరుబాట పట్టారు. 36 గంటల నిరసన దీక్ష పేరుతో చేపట్టిన ఆందోళన కార్యక్రమం సోమవారం నాడు ప్రారంభం అయ్యింది. సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది అంగన్‌వాడీ కార్మికులు, మినీ కార్మికులు తరలొచ్చారు. వీరి నిరసనతో అనంతపురం కలెక్టరేట్ ప్రాంతం దద్దరిల్లింది.

అనంతపురం కలెక్టరేట్ వద్ద 36 గంటల నిరసన దీక్షలో పాల్గొన్న అంగన్‌వాడీలు

- సమస్యల పరిష్కారం కోరుతూ 36 గంటల నిరసన దీక్ష
- ఆందోళనతో అట్టుడికిన కలెక్టరేట్
- జిల్లా నలుమూలల నుంచి తరలొచ్చిన వేలాది మంది అంగన్‌వాడీలు

సభావేదిక నుంచి అభివాదం చేస్తున్న సిఐటియు, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అపరిష్కృత సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీలు చేపట్టిన 36 గంటల నిరసన దీక్ష సోమవారం ఉదయం ప్రారంభం అయ్యింది. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి నూర్ మహమ్మద్, జిల్లా కార్యదర్శి నాగేంద్ర కుమార్, అధ్యక్షులు నాగమణి, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా నేతలు శకుంతల, రమాదేవి తదితరులు పాల్గొన్నారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి నూర్ మహమ్మద్ మాట్లాడుతూ ఐసిడిఎస్ వ్యవస్థను అంతం చేయడానికి నూతన విద్యా విధానం పేరుతో కేంద్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందన్నారు. దానికి వంత పడుతూ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం కూడా బైజుస్ పేరుతో అంగన్వాడీల పీకపిసికే కుట్ర చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పథకాల అమలు విషయంలో అన్ని పనులకు రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ సిబ్బందిని ఉపయోగించుకుంటోందన్నారు. ఇంత కష్టపడి పని చేస్తున్న వారి సమస్యల పరిష్కారంలో మాత్రం నిర్లక్ష్య వైఖరి అవలంభించడం విచారకరం అన్నారు. అంగన్‌వాడీలకు ఎటువంటి శిక్షణ ఇవ్వకుండానే ఆన్‌లైన్ పనులు ప్రారంభించారన్నారు. ఫోన్‌లు పని చేయక పోవడం, ఆన్‌లైన్ వర్క్ చేయడానికి అవసరమైన నెట్ సిగల్స్ లేకపోవటం వల్ల అంగన్‌వాడీ సిబ్బంది తీవ్ర మానసిక ఒత్తిడితో అనారోగ్యానికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా అంగన్వాడీలకు వేతనాలను పెంచాల్సి ఉందన్నారు. అంగన్‌వాడీలు పోరాటాల ఫలితంగా 2018లో మోడీ దీపావళి కానుకగా వర్కర్‌కి రూ.1,500, హెల్పర్‌కి రూ.750, మినీలకి రూ.1,250 వేతనాలు పెంచుతానని హామీ నేటికీ అమలుకు నోచుకోలేదన్నారు. తెలంగాణలో ఇచ్చే వేతనం కన్నా అదనంగా రూ.వెయ్యి ఇస్తామన్న హామీని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నిలబెట్టుకోవాలన్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ మెనూ, మెనూ ఛార్జీలు పెంచాలన్నారు. 2017 నుండి టీఏ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. సెంటరు అద్దెలు 4 నెలల నుంచి ఇవ్వలేదన్నారు. నెలనెలా వేతనాలు వచ్చే పరిస్థితీ లేదన్నారు. తక్షణం ఈ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ మాట్లాడుతూ అందరికీ బటన్ నొక్కి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నానని గొప్పలు చెప్పే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అంగన్‌వాడీల సమస్యలపైనా సానుకూలంగా స్పందించాలన్నారు. అతి తక్కువ వేతనాలతో పని చేసే అంగన్వాడీలకు ప్రభుత్వ పథకాలను వర్తింపజేయకపోవడం విచారకరం అన్నారు. హెల్పర్ల ప్రమోషన్లలో రాజకీయ జోక్యాన్ని అరికట్టాలన్నారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలి డిమాండ్ చేశారు. అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమాదేవి మాట్లాడుతూ రాష్ట్రంలో మినీ వర్కర్లకు కనీసం వేసవి సెలవులు ఇవ్వడంలేదన్నారు. ప్రమోషన్లు ఇవ్వాలని జీవో ఉన్నా కూడా అమలు కావట్లేదు. దీంతో మినీ వర్కర్లు అనేక ఇబ్బందులు పడు తున్నారని తెలిపారు. ఈ సమస్యలన్నింటిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సానుకూలంగా స్పందించకపోతే అంగన్‌వాడీల ఆందోళనను రాష్ట్ర స్థాయి ఉద్యమంగా కొనసాగిస్తామని దీక్షా శిబిరం నుంచి నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి, జిల్లా అంగన్వాడీ యూనియన్ అధ్యక్షురాలు శంకుతల, సిఐటియు జిల్లా అధ్యక్షురాలు ఎం.నాగమణి, నాయకులు నాగభూషణం, వెంకటనారాయణ, గోపాల్, ఏటీఎం నాగరాజు, మన్నీల రామాంజనేయులు, శ్యామల, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్, శివ పాల్గొన్నారు.

అందరి సహకారంతో

ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం

కలెక్టర్ ఎం.గౌతమి

కలెక్టర్ ఎం.గౌతమి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఈనెల 8న కళ్యాణదుర్గంలో జరిగిన రాష్ట్రస్థాయి రైతు దినోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను జిల్లా అధికారులు, సిబ్బంది అందరి సహకారంతో విజయవంతం అయ్యిందని కలెక్టర్ ఎం.గౌతమి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్ హాలులో స్పందన కార్యక్రమం అనంతరం అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కళ్యాణదుర్గంలో రాష్ట్రస్థాయి కార్యక్రమాన్ని ఎలాంటి ఇబ్బందులూ లేకుండా నిర్వహించడంలో అధికారుల పాత్ర అమోఘం అన్నారు. అందరి సమిష్టి కృషితో కార్యక్రమం విజయవంతం అయ్యిందన్నారు. భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌వో గాయత్రిదేవి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పిఎంఈజిపి లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ

సోమవారం స్పందన కార్యక్రమం అనంతరం జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన అర్హులైన 26 మంది లబ్ధిదారులకు పిఎంఈజీపి పథకం ద్వారా మంజూరైన రూ.49.40 లక్షల రుణ మొత్తాన్ని చెక్కు రూపంలో సంబంధిత లబ్ధిదారులకు కలెక్టర్ గౌతమి అందజేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ డిఆర్ఓ గాయత్రిదేవి, పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డా॥సుబ్రహ్మణ్యం, లీడ్ బ్యాంక్ మేనేజర్ సత్యరాజు జిల్లా పరిశ్రమ శాఖ జనరల్ మేనేజర్ నాగరాజు, కెనరా బ్యాంక్ చీఫ్ మేనేజర్ వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

పంటలబీమాలో అక్రమాలపై ఫిర్యాదు

ఎమ్మెల్యే పెద్దారెడ్డి నుంచి రూ.14 లక్షలు రికవరీ చేయండి

తాడిపత్రి ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి

ఎమ్మెల్యే పెద్దారెడ్డి అక్రమంగా పంటలబీమా పొందారని ఆధారాలను చూపుతున్న జెసి.ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

పంటలబీమాలో జరిగిన అక్రమాలపై విచారణ చేపట్టాలని తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం నాడు అనంతపురం జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో ఆయన ఫిర్యాదు చేశారు. తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తన పొలంలో ఒకటిన్నర సంవత్సరం చీని చెట్లకు రూ.14 లక్షలు పరిహారం ఏ రకంగా వచ్చిందో చెప్పాలని ప్రశ్నించారు. దీనిపై విచారణ చేపట్టి, రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. అంతకు మునుపు నగరంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఆదివారం రోజు ప్రభాకర్‌రెడ్డిని విమర్శించారు. దీనిపై ఆయన స్పందించారు. కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, ఆయన బాబాయ్ పెద్దారెడ్డిలపై గతంలో మద్యం తయారీ కేసులు నమోదయ్యాయని గుర్తు చేశారు. వాటికి సంబంధించి కేసుల వివరాలను వెల్లడించారు. వీరు తమను విమర్శించడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. ఇదే రకంగా మాట్లాడితే మరిన్ని ఆధారాలతో వారు చేసిన వాటిని బయటపెడతానని హెచ్చరించారు.

రాయలసీమ హక్కుల పరిరక్షణలో జగన్ విఫలం

అఖిలపక్ష సమావేశంలో నాయకులు

అఖిలపక్ష సమావేశంలో మాట్లాడుతున్న కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయలసీమ హక్కుల పరిరక్షణలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఘోరంగా విఫలమయ్యారని వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఆరోపించారు. 'రాయలసీమ భవిష్యత్తు-సమాలోచన' పేరిట సోమవారం స్థానిక ఎన్‌జిఒ హోంలో అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఇందులో జగన్ దుష్టపాలనను అంతం చేయకపోతే రాష్ట్రానికి భవిష్యత్తు ఉండదన్న అభిప్రాయం వక్తల మాటల్లో వ్యక్తమైంది. స్వార్థ ప్రయోజనా లు, అక్రమ ఆస్తులను కాపాడుకోవడం కోసం పక్క రాష్ట్రాలకు తాకట్టు పెడుతున్నారని మండిపడ్డారు. టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ జగన్ బలహీనతలను అలుసుగా చేసుకుని రెండేళ్లుగా తెలంగాణ ప్రభుత్వం కృష్ణా జలాల్లో సగం వాటా డిమాండ్ చేస్తుందన్నారు. ఉమ్మడి ఆస్తులపై ఎపికి ఉన్న హక్కులను కెసిఆర్‌కు తాకట్టు పెట్టడం వల్లే తెలంగాణ ప్రభుత్వం కొత్త సెక్రటేరియట్‌ను నిర్మించుకోగలిగిం దన్నారు. అప్పర్ భద్ర నిర్మాణానికి కేంద్రం నిధులిస్తే వైసిపి ఎంపిలు ఒక్కరైనా స్పందించారా అని ప్రశ్నించారు. తుంగభద్ర జలాల అక్రమ వాడకానికి నవలి ప్రాజెక్టును కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రకటిస్తే ఎపి సర్కారు ఎందుకు నోరు మెదపడం లేదన్నారు. సిపిఐ నాయకులు నాగార్జున మాట్లాడుతూ సిఎం జగన్ రాయలసీమ భవిష్యత్తును నాశనం చేస్తున్నారని ఆరోపించారు. సాగునీటి ప్రాజెక్టుల పనులను నిలిపివేయడం వల్ల కోలుకోలేని నష్టం వాటిల్లుతోందన్నారు. సిపిఎం కార్యదర్శి మల్లికార్జున మాట్లాడుతూ రాయదుర్గం ప్రాంత జలవనరులపై వైసిపి ప్రభుత్వానికి ఏ మా త్రం చిత్తశుద్ధి లేదన్నారు. జీడిపల్లి-బిటిపి పనులు నాలుగేళ్లుగా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకుడు అనిల్ మాట్లాడుతూ 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఫాల్స్‌గా అభివర్ణించారు. ఎస్ఎఫ్ఐ నాయకు డు బంగి శివ మాట్లాడుతూ పాఠశాలల విలీనం వల్ల లక్షలాది మంది పేద విద్యార్థులు చదువుకు దూరమవుతు న్నారన్నారు. ఎఐఎస్ఎఫ్ నాయకుడు ఆంజనేయులు మాట్లాడుతూ నూతన విద్యావిధానం విద్యా రంగానికి అత్యంత నష్టం చేస్తుందన్నారు. లోక్‌సత్తా జిల్లా అధ్యక్షులు వెంకటరమణబాబు మాట్లాడుతూ అధికారం రాగానే కాపు రామచంద్రారెడ్డి చెలరేగిపోతున్నాడని, అతనివి పిరికిపంద రాజకీయాలని దుయ్యబట్టారు. కార్యక్రమంలో రిటైర్డు డిఇ రామాంజనేయులు, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేశవరెడ్డి, ఎంఆర్‌పిఎస్ నాయకులు హరగోపాల్, ఎఐవైఎఫ్ కొట్రేష్, బిఎస్‌పి ఉలిగయ్య, ఎంఎంఐఎస్ మద్దానప్ప, టిడిపి పట్టణ, మండల అధ్యక్షులు నాగరాజు, యు.హనుమంతరెడ్డి, బలరామిరెడ్డి, హనుమంతు, పురుషోత్తం, వెంకటేష్, మహబూబ్‌బాషా, ఇనాయత్, వేణుగోపాల్, సన్నన్న, లోకానంద, తదితరులు పాల్గొన్నారు.

12, 13, 14వ తేదీల్లో సిపిఎం రాష్ట్ర సమావేశాలు

- ముఖ్యఅతిథులుగా కేరళ మాజీ మంత్రి ఎంఎ.బేబి, పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు హాజరు

రాష్ట్ర కమిటీ సమావేశాల వివరాలను వెల్లడిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఈ నెల 12, 13, 14వ తేదీల్లో అనంతపురంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు జరుగుతున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ తెలిపారు. సోమవారం నాడు గణానాయక్ భవన్‌లో జరిగిన పార్టీ నగర కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఏకపక్షంగా అమలవుతున్న బిజెపి విధానాలకు ప్రత్యామ్నాయ రాజకీయాలను ప్రజల ముందుంచేలా సిపిఎం రాష్ట్ర సమావేశాల్లో చర్చించనున్నట్లు తెలిపారు. 13వ తేదీ జరిగే బహిరంగసభ జయప్రదం కోసం మంగళవారం నాడు జిల్లావ్యాప్తంగా స్కూటర్ యాత్రలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి నిధులు సాధించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందన్నారు. ప్రజలపై భారాలు వేసే విద్యుత్ సంస్కరణలను దేశంలో అందరికంటే ముందుగా రాష్ట్రంలో అమలు చేయడం చూస్తే బిజెపికి రాష్ట్ర ప్రభుత్వం ఎలా సాగిలా పడుతోందో అర్థం చేసుకోవచ్చన్నారు. కేంద్రీయ విశ్వవిద్యాలయానికి అరకొర నిధులు, తుంగభద్ర డ్యాం నీటికి ప్రమాదంగా కర్నాటకలో నిర్మిస్తున్నా ప్రాజెక్టులు, విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ, కడప ఉక్కు పరిశ్రమ స్థాపనలో నిర్లక్ష్యం లాంటి అంశాలపై కార్యాచరణ రూపొందించనున్నట్లు ఆయన తెలిపారు. గత సంవత్సరం రైతులు నష్టపోయిన పంటలకు ప్రభుత్వం నామమాత్ర పరిహారం విడుదల చేసిందన్నారు. ఉపాధి హామీ పథకానికి, ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్లకు నిధుల కోత, పోలవరం నిర్వాసితుల సమస్య, దళితులు, మహిళలపై కొనసాగుతున్న దాడులపై సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాల్లో చర్చించనున్నామన్నారు.

12న చర్చావేదిక.. 13న బహిరంగ సభ

మూడు రోజుల సమావేశాలు తపోవనం సర్కిల్‌లోని జిపిఆర్ ఫంక్షన్ హాల్‌లో జరుగుతాయన్నారు. 12వ తేదీ రాష్ట్ర కార్యదర్శివర్గం, 13, 14న రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొంటారని చెప్పారు. 12వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు జెడ్పీ హాల్లో 'వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి- కేరళ ప్రభుత్వ నమూనా' అనే అంశంపై కేరళ మాజీ మంత్రి ఎంఎ.బేబితో చర్చావేదిక ఉంటుందన్నారు. 13వ తేదీ సాయంత్రం 5 గంటలకు మున్సిపల్ ఆఫీస్ సర్కిల్ వద్ద బహిరంగసభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి.రాఘవులు, ఎంఎ.బేబి, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, మాజీ ఎంఎల్‌ఎ ఎంఎ.గఫూర్ ఉపన్యసిస్తారని తెలిపారు.

'కాలవ' పాలన దోపిడీమయం : కాపు

ప్రజాశక్తి-రాయదుర్గం

టిడిపి హయాంలో కాలవ శ్రీనివాసులు మంత్రిగా ఐదేళ్లు కేవలం దోపిడీలకు సమయం కేటాయించి రూ. కోట్లు కూడబెట్టుకున్నారని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో ఆరోపించారు. ఆయన అనుచరులు అన్ని విధాలా దోచుకోవడానికి కాలవ అవకాశాలు కల్పించి ప్రజాధనాన్ని లంచాల రూపంలో దండుకున్నారని, దీంతో ఎన్నికల్లో ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పారన్నారు. కాలవ తప్పిదాలు, చేతగానితనం, అసమర్థత, దోపిడీలను కప్పిపుచ్చుకునేందుకు, ప్రజల దృష్టి మళ్లించేందుకు ఇతరులపై ఆరోపణలు చేస్తూ ఉనికి కోసం ప్రయత్నిస్తున్నాడన్నారు. వారానికి ఒక సెల్ఫ్ డబ్బా కొడుతున్నాడని, కాలవ పెడుతున్న ప్రతి సెల్ఫీ అతని హయాంలో చేయలేనివి, అతని చేతగానితనాన్ని, అసమర్థతను బయటపెట్టేవే అన్నారు.

కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అందజేయాలి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు అందజేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పిడిఎస్‌యు) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక జూనియర్ కళాశాలల విద్యార్థులతో కలిసి తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి జిల్లా వ్యాప్తంగా జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనంతో పాటు ఉచిత పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయాలని, లేకుంటే పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించా రు. ధర్నాలో సంఘం నాయకులు వినయ్, ఉమేష్, వీరేంద్రప్రసాద్, ప్రసాద్ పాల్గొన్నారు.

గవర్నర్‌ను ఆహ్వానిస్తున్న విజయనగర లాకాలేజ్ ప్రిన్సిపాల్ రాగవేంద్రచార్

17న విజయనగర న్యాయ కళాశాలకు

రాష్ట్ర గవర్నర్ రాక

ప్రజాశక్తి అనంతపురం

ఈనెల 17న అనంతపురం శ్రీ విజయనగర న్యాయ కళాశాలకు రాష్ట్ర గవర్నర్‌జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్ రానున్నారని కళాశాల ప్రిన్సిపాల్ రాఘవేంద్రచార్ తెలిపారు. సోమవారం బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యులు ఎ.రామిరెడ్డితో కలిసి గవర్నర్‌ను కలిసి వ్యక్తిగతంగా ఆహ్వానించినట్లు తెలిపారు. కళాశాల అదనపు భవనాల నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమంలో గవర్నర్ పాల్గొంటారని చెప్పారు. గవర్నర్‌ను కలిసిన వారిలో జిల్లా ప్రధాన న్యాయస్థానం పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాచమల్లు హరినాథ్ రెడ్డి, మధ్యవర్తిత్వ కేంద్ర సభ్యుడు హరికృష్ణ ఉన్నారు.

మహిళా ఖైదీలకు చేయూతనందిస్తాం

మహిళాఖైదీలతో మాట్లాడుతున్న బ్యాంకు అధికారులు

అనంతపురం : జిల్లాజైలులో శిక్ష అనుభవిస్తున్న మహిళా ఖైదీలకు శిక్షకాలం పూర్తయిన తర్వాత చేయూత నందిస్తామని నాబార్డు డిడిఎం కె.అను రాధ, ఎడిసిసి బ్యాంకు జిఎం కె.సురేఖ తెలిపారు. సోమవారం బుక్కరాయస ముద్రం మండలం జిల్లాజైలులో ఆర్థిక సాక్షరతా కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎడిసిసి బ్యాంకు సిబ్బంది మహిళా ఖైదీలతో సేవింగ్స్ ఖాతా లను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా ఖైదీలు శిక్ష ముగిసిన తరువాత జనజీవన స్రవంతిలో కలిసిపోయేందుకు బ్యాంకు తరుపున వారికి అవసరమైన రుణసదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు. అలాగే నాబార్డు అధ్వర్యంలో కుట్టు శిక్షణ, ఎంబ్రాయిడరీ, మగ్గం పని తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఓల్డ్‌టౌన్ బ్రాంచి మేనేజర్ సునీత, సూపర్‌వైజర్ గిరి, ఎడిసిసిబి సిబ్బంది, జిల్లా జైలు సిబ్బంది పాల్గొన్నారు.

సుందరమైన 'అనంత'కు కృషి

అనంతపురం : కరువు జిల్లాగా పేరుగాంచిన అనంతపురం జిల్లాలో పచ్చదనాన్ని నింపి సుందరమైన నగరంగా మార్చడమే ధ్యేయమని గ్రీన్ ఆర్మీ పేరుతో ఏర్పాటు చేసిన డిస్కవర్ అనంతపురం సంస్థ అధినేత అనిల్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ ప్రజాశక్తితో మాట్లాడుతూ పచ్చని అనంతపురం కోసం రూ.15 లక్షల విలువజేసే పండ్ల మొక్కలను అనంత ప్రజలకు ఉచితంగా పంచేందుకు కర్ణాటక నుంచి తెప్పించినట్లు తెలిపారు. ఇందులో జామ, మామిడి, ఉసిరి, బాదాం, జమైకన్ పెప్పర్, నేరేడు, చింత మొక్కలు ఉన్నట్లు తెలిపారు. ఇప్పటికే మొక్కలను పోలీస్ నర్సరీకి అందజేసినట్లు తెలిపారు.

'కాపు' అసమర్థతతో ఆగిన రైల్వే వంతెన పనులు

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం పట్టణానికి నగర సొబగులు అద్దాలని తాను మంత్రిగా ఉన్నప్పుడు రెండు రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జిలను మంజూరు చేయిస్తే ప్రస్తుత ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి అసమర్థత వల్ల అవి అర్ధాంతరంగా ఆగిపోయాయని మాజీ మంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు విమర్శించారు. సెల్ఫీ ఛాలెంజ్‌లో భాగంగా కాలవ టిడిపి హయాంలో నిర్మాణ పనులు ప్రారంభమైన కణేకల్లు రోడ్డులోని బ్రిడ్జి వద్ద సోమవారం 13వ సెల్ఫీ వీడియోను విడుదల చేశారు. టిడిపి హయాంలో పట్టణంలోని కణేకల్లు, అనంతపురం రహదారుల్లో రెండు బ్రిడ్జిల నిర్మాణాలను ప్రారంభించి రైల్వే భాగం వరకు పూర్తి చేశామన్నారు. తర్వాత వైసిపి ప్రభుత్వం వాటిని పట్టించుకోని కారణంగా ఆర్‌అండ్‌బి నిర్మించాల్సిన పనులు ముందుకు సాగలేదన్నారు. ఆ వంతెనలు 'కాపు' చేతకానితనానికి చేదు గుర్తులుగా, దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయన్నారు. "కాపు" అక్రమ సంపాదనపై పెట్టే శ్రద్ధలో కనీసం పదో వంతైనా ప్రగతి పనులపై పెట్టకపోవడం వల్లే నియోజకవర్గంలో అభివృద్ధి కుంటు పడిందని కాలవ విమర్శించారు.

రైల్వే బ్రిడ్జి వద్ద సెల్ఫీ ఛాలెంజ్ చేస్తున్న కాలవ శ్రీనివాసులు

నిత్యావసర సరుకుల ధరలను తగ్గించాలి

సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు

ప్రజాశక్తి-గుంతకల్లు

పేద, మధ్య తరగతి ప్రజలు కొని తినలేని స్థాయిలో పెరిగిన నిత్యావసర సరుకుల ధరలను వెంటనే తగ్గించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం స్థానిక పొట్టి శ్రీరాములు కూడలిలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలు కొనలేని స్థితిలో నిత్యావసర సరుకుల ధరలు ఉండగా 'మూలిగే నక్కపై తాటిపండు' పడ్డట్టు కూరగాయల ధరలు ఆకాశాన్ని చేరాయన్నారు. దీంతో ప్రజలు ఏం కొనాలో ఏం తినాలో తెలియని అయోమయ పరిస్థితిలో ఉన్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు ప్రజల పరిస్థితులను గుర్తించి వెంటనే రైతుల దగ్గర ప్రభుత్వం గిట్టుబాటు ధరతో కొనుగోలు చేసి ప్రభుత్వ చౌకధాన్యపు డిపోల్లో సబ్సిడీతో ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కార్యవర్గ సభ్యులు దాసరి శ్రీనివాసులు, మారుతీప్రసాద్, జగ్గిలి రమేష్, పట్టణ కమిటీ సభ్యులు సాకే నాగరాజు, కసాపురం రమేష్, పట్టణ నాయకులు దాసరి వరణ్, రామునాయక్, తిమ్మప్ప, ఎస్ఎఫ్ఐ నాయకులు వెంకి, చందు, ఆవాజ్, నాయకులు షాషా, ఖాదర్, తదితరులు పాల్గొన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఎం నాయకులు

పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి-ఉరవకొండ

పంటలు నష్టపోయిన రైతులందరికీ బీమా ప్రకటించి ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బిరుతల మల్లికార్జున డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఎపి రైతుసంఘం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కురుగుంట మనోహర్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని పంటలకూ బీమా వర్తింపజేయాలన్నారు. పంటలు నష్టపోయి అనేకమంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడం చాలా బాధాకరమన్నారు. తక్షణం ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే కౌలు రైతులకు సాగు సాయం కింద ఎకరాకు రూ.10వేలు ఇవ్వాలని, రైతు రుణమాఫీ చేయాలని, కేరళ ప్రభుత్వ తరహాలో రుణ విముక్తి చట్టాన్ని తీసుకురావాలని, 50 సంవత్సరాలు పూర్తయిన ప్రతి రైతుకూ రూ.10వేల పింఛన్ ఇవ్వాలని, సాగు పట్టాలివ్వడంతోపాటు పాడి పశువులకు బ్యాంకుల్లో 50శాతం సబ్సిడీతో రుణాలివ్వాలన్నారు. 90 శాతం సబ్సిడీతో స్ప్రింక్లర్లు, డ్రిప్‌లు ఇవ్వాలని, ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాలని, డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు బోయ గోపాల్, డిహెచ్‌పిఎస్ జిల్లా కార్యదర్శి మల్లికార్జున, నియోజకవర్గ నాయకులు సుల్తాన్, రమణ, నారాయణమ్మ, వెంకటేష్, ప్రసాద్, నారాయణప్ప, ఖాసీం, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న ఎపి రైతుసంఘం నాయకులు, రైతులు

క్లాప్ కలెక్షన్లు పెరగాల్సిందే..

హెల్తాఫీసర్ గంగాధర్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరపాలక సంస్థ పరిధిలో క్లాప్ కలెక్షన్లు పెంచాల్సిందేనని హెల్తాఫీసర్ గంగాధర్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం నగరంలోని రెవెన్యూ విభాగంలో క్లాప్ కలెక్షన్స్, పారిశుధ్య పరిస్థితులపై సమీక్ష నిర్వహించారు. సమావేశం ప్రారంభం కాగానే కలెక్షన్లపై సమీక్ష నిర్వహిస్తూ మీకు నోడల్ ఆఫీసర్లు ఎరు.. అంటూ సచివాలయ శానిటరీ ఇన్స్‌పెక్టర్లను కమిషనర్ భాగ్యలక్ష్మిని ప్రశ్నించగా మౌనమే సమాధానమైంది. ఈదశలో హెల్తాఫీసర్ గంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ నగరంలో పారిశుధ్య పనులు అధ్వానంగా ఉన్నాయన్నారు. ముఖ్యంగా శానిటరీ ఇన్స్‌పెక్టర్ల పర్యవేక్షణ కొరబడిందన్నారు. సచివాలయ శానిటరీ ఇన్స్‌పెక్టర్లు ఫీల్డ్‌లో ఉన్నట్టు కేవలం ఫొటోలు మాత్రమే తీసుకుని అప్లోడ్ చేస్తున్నారు తప్ప పనులు చేయడం లేదన్నారు. నగరంలో క్లాప్ కలెక్షన్స్ పెంచి తీరాల్సిందేనన్నారు. బదిలీపై వెళ్తున్న వారు కచ్చితంగా బకాయిల వసూలు చేసిన తర్వాతనే రిలీవ్ చేస్తానని స్పష్టం చేశారు. కమలానగర్ నుంచి రోజూ టన్నుల కొద్దీ చెత్త తరలిస్తుంటే, వాణిజ్య సముదాయాలు, అపార్టుమెంట్ల నుంచి చెత్త పన్ను వసూలు చేయడానికి ఎందుకు చర్యలు చేపట్టడం లేదని ప్రశ్నించారు.

సమీక్ష నిర్వహిస్తున్న మున్సిపల్ అధికారులు

ఫ్లోరోసిస్ నివారణకు కృషి

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

మండల వ్యాప్తంగా ఫ్లోరోసిస్ ప్రభావిత ప్రాంతాలను గుర్తించి ప్రభావిత ప్రాంతాల్లో నివారణ చర్యలు చేపట్టినట్లు డాక్టర్ ఎ.కళ్యాణ్‌కుమార్ తెలిపారు. జాతీయ ఫ్లోరోసిస్ నివారణలో భాగంగా జిల్లా వైద్యుల ఆదేశాల మేరకు సోమవారం మండల పరిధిలోని పసలూరు గ్రామంలో ఫ్లోరోసిస్ బాధితులకు రిహాబిలిటేషన్ (పునరావాసం) పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలతోపాటు ఇంటింటి సర్వే నిర్వహించి ఫ్లోరోసిస్‌కు సంబంధించిన అనుమానాస్పద కేసులను గుర్తించి మూత్ర, రక్త నమూనాలను సేకరించి వాటిని జిల్లాకేంద్రానికి పంపించి నిర్ధారించనున్నట్లు తెలిపారు. అలాగే వారికి పునరావాస సహాయక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త శశికళ, ఎంఎల్‌హెచ్‌పి పల్లవి, ఆరోగ్య కార్యకర్త విల్సన్, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాసుపుస్తకం పోయినది

పొలం పట్టా పాస్ పుస్తకం దొరికితే ఇవ్వగలరు :కురుబ ఆంజనేయులు బొమ్మనాహల్ మండలం ఉంతకల్లు గ్రామానికి చెందిన కురువ ఆంజనేయులు S/o వన్నూరుప్ప33స,,లు అనే రైతు పొలం పట్టా పాసుబుక్ పోయినది సర్వే నెం:173/1ఉద్దేహాల్ గ్రామం నందు బ్యాంకుకి వెళ్లినప్పుడు పోగొట్టుకున్నాడు. కావున దొరికిన వారు తహసీల్దార్ బొమ్మనాహల్ ఆఫీస్‌కి అందిచగలరని కోరుచున్నాము.

Cell: 6302860550

మహారాజశ్రీ ఎస్.సి/ఎస్.టి. కేసుల విచారణ ప్రత్యేక న్యాయ స్థానం:అనంతపురము గారి కోర్టులో

O.S.87/2021

Between:
ఎన్.పార్వతమ్మ మరియు ఇతరులు. ...వాదులు
ఎదిరి
శ్రీమతి అద్దగిరి సుశీలమ్మ మరియు ఇతరులు. ...ప్రతివాదులు

D33వ, D34వ ప్రతివాదులకి నోటీసు

D33: ఆకుల లక్ష్మీకాంతమ్మ W/o జగదీశ్, డోర్‌నెం.11/871, కుర్రాకుల స్ట్రీట్, ధర్మవరం టౌన్ మరియు మండల్, శ్రీసత్యసాయి జిల్లా.
D34: దండు వెంకటరాముడు, తండ్రి దండు మల్లేసు, హిందు, డోర్‌నెం.10/472, నాగులబావి స్ట్రీట్, ధర్మవరం టౌన్ మరియు మండల్, శ్రీసత్యసాయి జిల్లా.

ఇందుమూలముగా ప్రతివాదులైన మీకు తెలియజేయడమేమనగా, పై కోర్టు వారు పై కేసులో మీకు పలుమార్లు నోటీసులు పంపినను చేరనందున ఈ ప్రకటన ద్వారా మీకు నోటీసు జారీ చేయమని ఆదేశించి పై కేసును 09-08-2023 వ తేదికి మీ హాజరు నిమిత్తం వాయిదా వేసియున్నారు. కావున మీరు సదరి తేదీనాడు ఉదయం 10.00 గంIIలకు ఖుద్దున గానీ, వకీలు ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలయును. లేనంతట పై కేసు మీ పరోక్షమున తీర్మానము తీర్మానించబడును. అని తెలియజేయడమైనది.

(కోర్టువారి ఆదేశాల మేరకు)

వాయిదా తేదీ:09-08-2023.

పి.నరసింహుడు, వి.యల్. కామేశ్వరి
వాదిపరం న్యాయవాదులు, అనంతపురం.

In the Court of the Hon'ble District Judge: Ananthapuramu
(In the matter of obtaining permission to sell Property of minor M.Sivaraj)
G.O.P.No.46/2023

Between:
Marasi Rajeswari W/o Marasi Rama Krishna, D.No.1-65, O.C. Colony, Amidala (Vi), Uravakonda (M), Ananthapuramu Dist., Now residing at Sai nagar, D.No.1/2-3-119-A, 4th Cross, Ananthapuramu City. ...Petitioner
And
NIL ...Respondants

Notice to whom So ever it may Concern

ఇందుమూలకముగా తెలియచేయడమేమనగా వాది ఎం.రాజేశ్వరి, భర్త ఎం.రామక్రిష్ణ గారు తన కుమారుడు అయిన మైనరు ఎం.శివరాజ్‌కు ఎం.రాజేశ్వరి గారు స్వయాన తల్లి మరియు గార్డియన్‌గా వ్యవహరించుచున్నారు. తన కుమారుడు మైనరు ఎం.శివరాజ్‌కు చదువులు మరియు సంరక్షణ నిమిత్తం మైనర్ ఎం.శివరాజ్ గారి తన తాతగారైన ఎం.నాగభూషణ గారు తనకు Gift Deed గా ఇచ్చిన స్థిరాస్తి షెడ్యూలు దాఖలా ఆస్తిని గార్డియన్‌గా వ్యవహరిస్తున్న ఎం.రాజేశ్వరిగారు అమ్మడానికి అనుమతి కొరకు పై కోర్టు నందు దావా వేసియున్నారు. కావున ఎవరికైన ఎటువంటి ఆక్షేపణలు ఉన్న యెడల 20-07-2023వ తేది ఉదయం10.30 గంIIలకు ఖుద్దున గానీ, వకీలు ద్వారా గానీ హాజరై తెలుపుకొనవలయును. లేనియెడల పరోక్షమందు తీర్మానించెదరు.

SCHEDULE

Property situated in R.D. and S.R.D, of Anantapuramu within the limits of Anantapuramu Municipal Corporaticon with the following description.

Ward	Sy.No.	A.C.	Plot No.s	A.C.
Old 12	216/2	1.14 paiki	2&3 paiki	0.04.18 paiki

North Side

New-13	A.C.	A.C.	H.S.	D.No.
Present:19	0.021/2 paii	0.01.22	0.005	19-3-373

Bounded by: East:20 feet road; South: Rermaining plot in the same plot; West: Rermaining plot in the same plot; North: Plot No.2 of N.Krishnamurthy.
In between measuring: East-West: 38 feet or 11.58 mtrs., North-South:14 feet or 4.26 mtrs. **Total Extent: 59.11 Sq.Yards.**

(By Court Order)

John Living Stone, Advocate, Ananthapuramu.

వేలం ప్రకటన

IN THE COURT OF SPECIAL SESSIONS JUDGE FOR TRIAL OF CASES UNDER SCs & STs (POA) ACT-VIII ADDL.DISTRICT & SESSIONS JUDGE: ANANTHAPURAMU
E.P.No.583/2019 in O.S. No.104/2018

Between:
Medamanuri Sudhamani ...Decree Holder
AND
Pathipati Rajasekhar Naidu ...Judgment Debtor

Whereas the Decree Holder filed the above E.P against the Judgment Debtor for recovery of the decreetal amount with interest and cost of the above suit. As on the date of sale in total amount of Rs.25,95,967/-,The Hon'ble Court order has been passed for the sale of the attached property mentioned in the schedule in satisfaction of the claim of the Decree Holder in the above E.P. At the sale the public generally are invited to bid, either personally or by duly authorized agent, No bid by, or on behalf of the J.Dr. The bidders shall binding the terms stipulated by the Hon'ble Court U/OR 21 R 66 C.P.C.

SCHEDULE

The property situated within RD, SRD and SRO of Anantapur Rural within Itikulapalli Village fields limits within the following description.

Sy.No.	A.C	A.C	A.C	H.S.
101-2,	3.60 paiki,	1.80 paiki,	0.19	0.80

Bounded on:-
East by : Sy.No.101-3 Jameenu,
West by : Rapthadu field and Sy.No.101-1 Jameenu,
North by: Road leads from Ananthapur to Kadiri
South by: Sy.No.101-1 the remaining balance extent in Sy.No.101-2
Total Area : 919.6 Square yards sum system (Joint).
Decree Holder Value Rs: 26,00,000/-
Ameena Value Rs: 60,00,000/-
Date of Sale :-31-07-2023 at 10.30 AM.

J. Narayana Swamy
Advocate for the Decree Holder, Ananthapuramu.

మహారాజశ్రీ తాడిపత్రి జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
E.P.NO:4/2022 in O.S.NO:50/2018.

Between:
P.శ్రీనివాసరెడ్డి ...పిటీషనరు/డి.హెచ్.ఆర్
ఎదిరి
K.తిరుమల రెడ్డి ...రెస్పాండెంటు/జె.డి.ఆర్

నోటీసు

To
K.తిరుమల రెడ్డి S/o చిన్న శివారెడ్డి, కుందనకోట గ్రామము, యాడికి మండలము, అనంతపురం జిల్లా

U/O 21 R 64 CPC ప్రకారం రెస్పాండెంటుకు నోటీసు

పై E.P లో పిటీషనరు/డి.హెచ్.ఆర్ తన డిక్రీ మొత్తమును రాబట్టు నిమిత్తము నీ స్థిరాస్తిని వేలమునకు తెచ్చియున్నారు. పై కోర్టు వారు వేలం షరతులు నిర్ణయించుటకు గాను 25/07/2023 వ తేదిన వాయిదా వేసి యున్నారు. పై తేదిన పై కోర్టు ఎదుట ఉదయం 10:30 ని॥లకు వారు స్వయంగా కానీ, లేదా వకీలు ద్వారా గానీ హాజరై అభ్యంతరములు తెలుపుకొనవచ్చును. లేని యెడల నీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)

సి.రమేష్‌నాథ్ రెడ్డి,
కె.శంకర రెడ్డి
డి.హెచ్.ఆర్ తరుపు న్యాయవాదులు, తాడిపత్రి

రాష్ట్ర సమావేశాలను జయప్రదం చేయండి

సిపిఎం ఆధ్వర్యంలో బైక్ ర్యాలీలు

ప్రజాశక్తి-పుట్లూరు

అనంతపురంలో ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకూ నిర్వహించనున్న రాష్ట్ర కమిటీ సమావేశాలను జయప్రదం చేయాలని సిపిఎం నాయకులు పిలుపునిచ్చారు. ఈమేరకు సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం మండల పరిధిలోని కడవకల్లు గ్రామంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాలు ఇచ్చిన హామీల అమలు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై వేస్తున్న భారాలపై చర్చించేందుకు రాష్ట్ర కమిటీ సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశాలకు పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు, ఎంఎ బేబీ, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసులు, కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్, పార్లమెంట్ మాజీ సభ్యులు పి.మధు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ సమావేశాల్లో ప్రస్తుతం రాష్ట్రంలోని రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిస్థితులను సమీక్షించి భవిష్యత్ కర్తవ్యాలను రూపొందించనున్నట్లు తెలిపారు. వీటన్నిటిపై రాష్ట్ర కమిటీ సమావేశాల్లో చర్చించి జులై 13న భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ సభకు రైతులు, కూలీలు, కార్మికులు పెద్దఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎస్.సూరి, ఎపి రైతుసంఘం మండల కార్యదర్శి జి.వెంకటచౌదరి, నాయకులు టి.పెద్దయ్య, బి.భాస్కర్‌రెడ్డి, కె.నాగభూషణం, ఆటం ఆదెప్ప, నరేంద్ర, రాజేష్, నాగార్జున, నరసింహా, తదితరులు పాల్గొన్నారు.

బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

కుటుంబ నియంత్రణకు ప్రోత్సాహకాలు

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి యుగంధర్

ప్రజాశక్తి-అనంతపురం

కుటుంబ నియంత్రణను బాధ్యతగా తీసుకుని సమాజాభివృద్ధికి కృషి చేస్తే ప్రోత్సాహకాలు అందజేయనున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ అధికారి యుగంధర్ తెలిపారు. ప్రపంచ జన దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో అవగాహన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభా పెరుగుదల వల్ల పర్యావరణ పరిరక్షణకు, మానవాళి మనుగడకి తీవ్ర ఇబ్బందులు కలుగుతాయన్నారు. ముఖ్యంగా భూమి, పర్యావరణపై అదనపు ఒత్తిడి పడుతుందన్నారు. అలాగే పేదరికం, పర్యావరణ క్షీణత, వనరుల క్షీణత, సామాజిక అసమానతలకు తావిస్తుందన్నారు. కావున జనాభా నియంత్రణ తాత్కాలిక, శాశ్వత పద్ధతులు పాటించాలని సూచించారు. ప్రోత్సాహకంగా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించుకుంటున్న వారికి, చేస్తున్న వారికి రూ.2,500 నుంచి రూ.5వేల వరకూ నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సుజాత, చెన్నకేశవులు, మనోజ్, డెమో ఉమాపతి, గంగాధర్, మారుతీప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లను విడుదల చేస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి యుగంధర్

తండ్రిని మించిన తనయుడు సిఎం జగన్

ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి

శింగనమల : తండ్రిని మించిన తనయుడు ముఖ్యమంత్రి జగన్ అని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి కొనియాడారు. వైఎస్ఆర్ జయంతిని పురస్కరించుకుని అమెరికాలోని వాషింగ్టన్ డీసీలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాల్లో మానవత్వం, విలువలు, విశ్వసనీయత ఉండాలన్నారు. ఆఖరికి రాజకీయ నాయకులు ఆ మాటలు కూడా మాట్లాడిన దాఖలాలు లేవన్నారు. ఈ పదాలు మొట్టమొదటగా వాడింది కూడా వైఎస్ఆర్ అన్నారు. ఆయన తర్వాత తనయుడు సిఎం జగన్ వాడుతున్నాడన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి సోషల్ మీడియా కన్వీనర్ సజ్జల భార్గవ్‌రెడ్డి, ఎపిఎన్ఆర్ఐ మేడపాటి వెంకట్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ స్పెషల్ రిప్రజెంటివ్ ఫర్ నార్త్ అమెరికా కడప రత్నాకర్, ఎపి ఫైబర్ నెట్‌వర్క్ ఛైర్మన్ గౌతమ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కుళ్లాయిస్వామి హుండీ లెక్కింపు

నార్పల : మండల పరిధిలోని గూగూడులో వెలసిన గూగూడు కుళ్లాయిస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన హుండీ ఆదాయాన్ని దేవాదాయ శాఖ అధికారులు, గ్రామపెద్దల ఆధ్వర్యంలో సోమవారం లెక్కించారు. ఇందులో మొత్తం రూ.11,12,877 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి శోభ తెలిపారు.

రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

నార్పల : వాహనాల డ్రైవర్లు రోడ్డు ప్రమాదాలపై పూర్తి అవగాహనతో ఉండాలని సిఐ అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటశివారెడ్డి తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా సోమవారం నార్పల మండల కేంద్రంలోని హైస్కూల్ మైదానంలో మండలంలోని ఆటో, ట్రాక్టర్, టాక్సీల డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదన్నారు. అలాగే డ్రైవర్ సీట్ పక్కనే ఉండే అతనపు సీట్లను తీసివేయాలన్నారు. డ్రైవింగ్ చేసేటప్పుడు డెక్కులు పెట్టుకుని ఎక్కువ సౌండ్‌తో వెళ్లకూడదన్నారు. మద్యం తాగవద్దన్నారు. ఇకపోతే గూగూడు బ్రహ్మోత్సవాల దృష్ట్యా కొద్దిరోజులు నార్పల నుంచి గూగూడు వరకూ ట్రాక్టర్లు తిరగకుండా చూసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిఐ అస్రార్‌బాషా, ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి, నార్పల పోలీస్ సిబ్బంది, డ్రైవర్లు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటశివారెడ్డి

సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి

మహిళతో మాట్లాడుతున్న టిసి వరుణ్

అనంతపురం : జనసేన పార్టీ అధికారంలోకి వస్తే చాలా చిత్తశుద్ధితో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు టిసి వరుణ్ తెలిపారు. సోమవారం నగరంలోని పాతూరు ఆసరమల్లా వీధిలో జనసేన జయభేరి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు పొదిలి బాబురావు, రాప్తాడు ఇన్‌ఛార్జి పవన్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు అంకే ఈశ్వరయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్మర నాగేంద్ర, జిల్లా కార్యదర్శులు రపా ధనుంజయ్, కిరణ్‌కుమార్, జయమ్మ, అవుకు విజయ్‌కుమార్, ముప్పూరి కృష్ణ, నగర ఉపాధ్యక్షులు జక్కిరెడ్డి ఆదినారాయణ, నగర ప్రధాన కార్యదర్శులు రోళ్ల భాస్కర్, మేదర వెంకటేష్, హుస్సేన్, దరాజ్ బాషా, నగర కార్యదర్శులు లాల్‌స్వామి, మురళి, జిక్కిరెడ్డి పద్మావతి, వెంకటరమణ, వీరమహిళలు పార్వతి, సరిత పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

తాడిపత్రి : తాడిపత్రి ఆర్డీటీ క్రికెట్ క్యాంపు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫాదర్ విన్సెంట్ క్రికెట్ టోర్నీని సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ టోర్నమెంట్‌లో 16 పాఠశాలల అబ్బాయి జట్లు, 9 పాఠశాలల అమ్మాయిల జట్లు పాల్గొంటున్నాయి. ఇందులో భాగంగా మొదటి మ్యాచ్ ట్రిపుల్ ఎస్ స్కూల్, సాయి విజేత స్కూల్ జట్ల మధ్య జరిగింది. మొదట బ్యాటింగ్ చేసిన ట్రిపుల్ ఎస్ హైస్కూల్ 10 ఓవర్లు 87 పరుగులు సాధించింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన సాయి విజేత హైస్కూల్ జట్టు 82 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో ట్రిపుల్ ఎస్ హైస్కూల్ జట్టు విజయం సాధించింది. రెండో మ్యాచ్ పద్మవాణి హైస్కూల్, చర్చ్ ద కింగ్ హై స్కూల్ జట్లు తలపడ్డాయి. మొదట పద్మావణి హైస్కూల్ జట్టు 93 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చర్చ్ ద కింగ్ హైస్కూల్ 91 పరుగులు చేసి ఓటమి పాలైంది. పద్మవాణి పాఠశాల జట్టులోని నరేంద్రకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందజేశారు. మూడో మ్యాచ్ నారాయణ స్కూలు, సూర్య హైస్కూల్ జట్ల మధ్య జరగ్గా మొదట నారాయణ హైస్కూల్ బ్యాటింగ్ చేసి 195 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్‌కు దిగిన సూర్య హైస్కూల్ జట్టు 61 పరుగులు సాధించి ఓటమి పాలైంది. ఈ కార్యక్రమంలో ఆర్డీటీ ఎటిఎల్ రామాంజనేయులు, సీనియర్ కోచ్ సాదిక్‌వలి, ఆర్డీటీ క్రికెట్ కోచ్ భార్గవ్, సీనియర్ క్రీడాకారులు, పాల్గొన్నారు.

పట్టుచీరల వ్యాపారులపై దాడి అమానుషం

యాడికి : ధర్మవరం పట్టణానికి చెందిన పట్టుచీరల వ్యాపారస్తులు ఆనంద్, గిర్రాజు శశిపై ఇటీవల విజయవాడలో జరిగిన దాడి అమానుషమని ఎపి చేనేత సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.బషీర్ అన్నారు. ఈమేరకు వెంటనే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం మండల కేంద్రంలోని కార్యాలయంలో తహశీల్దార్ అలెగ్జాండర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయకపోవడం వల్ల చేనేత పరిశ్రమ ఇప్పటికే తీవ్ర సంక్షోభంలో కూరుకపోయిందన్నారు. ఇలాంటి తరుణంలో చేనేత పట్టుచీరల వ్యాపారులపై దాడుల చేయడం వల్ల చేనేత పరిశ్రమలో జీవించే వారి ఆత్మగౌరవం దెబ్బతింటుందన్నారు. వెంటనే పట్టుచీరల వ్యాపారులపై దాడిచేసిన వారిని శిక్షించాలని, లేనిపక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ మెంబర్ మోహన్, జిల్లా సహాయక కార్యదర్శి కె.శ్రీనివాసులు, చేనేత కార్మికులు సంజీవులు, కోదండరావు, వెంకటేష్, రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

నేడు స్కూటర్‌యాత్ర

శింగనమల : మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించనున్న స్కూటర్ యాత్రను విజయవంతం చేయాలని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి భాస్కర్ సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకూ నిర్వహించనున్న రాష్ట్ర కమిటీ సమావేశాల విజయవంతానికి స్కూటర్ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేరాలు ఘోరాలు

మట్కా నిర్వాహకులు అరెస్టు-నగదు స్వాధీనం

డీఎస్పీ గంగయ్య

ప్రజాశక్తి-తాడిపత్రి

మట్కా నిర్వాహకుల వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ గంగయ్య

పట్టణంలోని మట్కా నిర్వాహకులపై దాడులు నిర్వహించి 12 మంది నిర్వాహకులను అరెస్టు చేయడంతోపాటు రూ. 10,21,355 నగదును స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ గంగయ్య తెలిపారు. సోమవారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన ఆధ్వర్యంలో పట్టణ సీఐ శంకర్‌రెడ్డి, ఎస్ఐ ధరణిబాబు, ఇంటెలిజెన్స్ విభాగం సిబ్బంది మూడు బృందాలుగా విడిపోయి పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో మెరుపు దాడులు నిర్వహించి విజయనగర్ కాలనీకి చెందిన కశ్యరవలి నౌసాద్, శ్రీనివాస పురానికి చెందిన ముక్తుమ్ మాబు, టైలర్స్ కాలనీకి చెందిన షేక్ హుస్సేన్‌బాషా, నందలపాడుకు చెందిన గంజుల లక్ష్మయ్య, భగత్‌సింగ్ నగర్‌కు చెందిన శరత్‌బాబు, నందలపాడుకు చెందిన నూర్ మహమ్మద్‌వలి, గన్నెవారిపల్లి కాలనీకి చెందిన షేక్ ఇమామ్‌ముద్దీన్, ఆసుపత్రిపాలెంకు చెందిన హాజీ ముస్తఫా, హరిజనవాడకు చెందిన మేకల పుల్లయ్య, రూరల్ పరిధిలోని తలారి చెరువు గ్రామానికి చెందిన ఉస్మాన్, ఆసుపత్రిపాలెంకు చెందిన ప్రతాప్, పాతకోటకు చెందిన వెంకటరమణను అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితుల నుంచి రూ.10,21,355 నగదు, మట్కా చీటీలు, 12బాల్ పెన్నులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మట్కా నిర్వాహకులు వారి స్వలాభం కోసం అమాయక ప్రజలకు అధిక మొత్తాన్ని ఆశ చూపుతూ సులభంగా దోసుకుంటున్నారన్నారు. ప్రజలు గమనించి మట్కా జోలికి పోవద్దని సూచించారు. ఎవరైనా మట్కా నిర్వహణకు పాల్పడితే సస్పెక్ట్ షీట్, పీడీ యాక్ట్ అమలు చేసి జిల్లా బహిష్కరణ చేస్తామని హెచ్చరించారు.

యువకుడు ఆత్మహత్య

మృతిచెందిన సురేష్

పుట్లూరు : ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం రాత్రి మండల పరిధిలోని ఎల్లుట్ల గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబీకుల వివరాల మేరకు.. ఎల్లుట్ల గ్రామానికి చెందిన చిన్న వెంకటరాముడు కుమారుడు గెంటే నరేష్ (22)కి తరచూ కడుపు నొప్పి, తలనొప్పి వచ్చేది. పలు ఆసుపత్రులతోపాటు ఆర్డీటీ ఆసుపత్రిలో కూడా చూపించుకున్నాడు. అయినా తగ్గలేదు. ఈనేపథ్యంలో ఆదివారం మరోసారి కడుపు, తలనొప్పి విపరీతంగా రావడంతో తట్టుకోలేక ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమణించిన స్థానికులు పోలీసులతోపాటు బంధువులకు సమాచారం అందించారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ వెంకటప్రసాద్ తెలిపారు.

కియా ఉద్యోగి మృతి

మృతిచెందిన షఫీ

బుక్కరాయసముద్రం : మండల పరిధిలోని వడియంపేట గ్రామ సమీపంలో చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో కియా ఉద్యోగి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గుత్తికి చెందిన హాజీవలి కుమారుడు మహమ్మద్ షఫీ (20) ద్విచక్ర వాహనంలో అనంతపురం వస్తుండగా మండలంలోని వడియంపేట సమీపంలోకి రాగానే ఎన్‌హెచ్ 45లో హెచ్‌పి గ్యాస్ వాహనం యూటర్న్ తీసుకుంటుండగా వెనుక నుంచి వచ్చి ఢీకొన్నాడు. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు కియాలో ఉద్యోగం చేస్తున్నట్లు సమాచారం. వెనుక కూర్చున్న వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

గుత్తి : మండలంలోని బసినేపల్లి గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. బసినేపల్లి తండా గ్రామ మలుపు వద్ద ముగ్గురు నిల్చోని ఉండగా రహదారిపై ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొంది. దీంతో ద్విచక్ర వాహనం రహదారి పక్కన ఉన్న గ్రామవాసులు కవితాబాయి, లక్ష్మణ్‌నాయక్, భానుతోపాటు ద్విచక్ర వాహనదారుడు బెంగళూరు వాసి రోహిత్‌కు తీవ్రగాయాలయ్యాయి. గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్లారు. అలాగే మండలంలోని కొత్తపేట గ్రామ శివారులో కారు బోల్తా పడిన ఘటనలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానిక పట్టణంలోని జంగాల కాలనీకి చెందిన ఓ కుటుంబం వారు నంద్యాల జిల్లాలోని యాగంటి పుణ్యక్షేత్రానికి వెళ్లి వస్తుండగా కొత్తపేట పరిధిలో కారు అదుపుతప్పి కంపచెట్లల్లోకి దూసుకెళ్లింది. దీంతో వెంకటేశ్వరమ్మ, రంగారెడ్డి, పద్మావతి, రాజశేఖర్ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఘటనలపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రేషన్ బియ్యం పట్టివేత

అనంతపురం క్రైం : కర్ణాటకకు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ ఎస్ఐ ఫణీంద్రనాథ్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. సోమవారం ఉదయం స్థానిక హౌసింగ్ బోర్డు వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా అశోక్ లేల్యాండ్ వాహనంలో తరలిస్తున్న 35 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. డ్రైవర్ సాకే విజయకుమార్, బియ్యం వ్యాపారి కొండూరు మల్లికార్జున, వాహన యజమాని బయలు ఎర్రిస్వామిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎఇఇ కుళ్లాయిరెడ్డి, సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

ఆర్ఐఓ కారు డ్రైవర్‌కు గుండెపోటు

అనంతపురం : జిల్లా ఆర్ఐఓ కారు డ్రైవర్ శ్రీనివాసులు (60) సోమవారం మధ్యాహ్నం గుండుపోటుతో మృతిచెందారు. శ్రీనివాసులు సోమవారం ఉదయం కారులో ఆర్ఐఓను తీసుకుని కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వచ్చారు. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో తన తోటి ముగ్గురు డ్రైవర్లు కలిసి టీ తాగడానికి క్యాంటీన్ వద్దకు వెళ్తుండగా శ్రీనివాసులుకు గుండెపోటు రావడంతో ఒక్కసారిగా కుప్పు కూలడు. వెంటనే తోటి డ్రైవర్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. డ్రైవర్ మృతి పట్ల ఆర్ఐఓ సురేష్‌బాబు, ఇతర అధికారులు, పలువురు డ్రైవర్లు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

జిల్లాకు చేరిన 2,700 మెట్రిక్ టన్నుల ఎరువులు

అనంతపురం : ఇప్పటి వరకూ జిల్లాకు 2,700 మెట్రిక్ టన్నుల స్పిక్ ఎరువుల సోమవారం జిల్లాకు చేరినట్లు అనంతపురం వ్యవసాయ డివిజన్ ఎడిఎ ఎం.రవి తెలిపారు. ఈమేరకు స్థానిక ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్ రేక్ పాయింట్ నుంచి ఆన్‌లోడ్ చేయించి ఉన్నతాధికారులకు నివేదించారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

ఉరవకొండ : మండల పరిధిలోని రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్యాధికారి వెంకటేష్ నాయక్ అధ్యర్యంలో గర్భిణులకు సోమవారం వైద్యపరీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా హైరిస్క్ గర్భిణులకు అన్నిరకాల ఆరోగ్య, రక్త పరీక్షలు నిర్వహించడంతోపాటు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. ముఖ్యంగా గర్భిణులు పోషకాహారం తీసుకోవాలన్నారు.అనంతరం అమిద్యాల గ్రామానికి చెందిన జిన్నా అబ్దుల్‌బాషా, కుమారులు ఉచిత భోజన వసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ నాగరంగయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్ఎండి షఫీ, స్టాఫ్‌నర్సులు సరస్వతి, ల్యాబ్ టెక్నీషియన్ రాణీ, ఫార్మాసిస్టు మంగమ్మ, సూపర్‌వైజర్ శేఖర్, ఎంఎల్‌హెచ్‌పిలు భవానీ, భారతి, నాగ సురేఖ, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నార్పల : మండల పరిధిలోని బి.పప్పూరు, నార్పల ప్రభుత్వ వైద్యశాలల్లో గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రతలతోపాటు సలహాలు, సూచనలు ఇచ్చారు. అనంతరం చెన్నకేశవ వృద్ధాశ్రమ నిర్వాహకులు స్రవంతి శేఖర్ గర్భిణులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు ప్రవీణ్‌కుమార్, రవిశంకర్, వైద్య సిబ్బంది, ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు, గర్భిణీలు, తదితరులు పాల్గొన్నారు.